# ఆత్మ



నాలుగో పాదం విరిగిపోయి, మూడో పాదం కుంటుతూ, రెండు పాదాల బలం మీదే ధర్మదేవత నడుస్తున్న రోజులు అవి!

అయోధ్యానగర శివార్లలో, ఆరుబయట గాలికి సగం ఆరి మిగతా సగం ఆరడానికి సూర్యోదయం కోసం ఎదురు చూస్తున్నాయి తాళ్ల మీది గుడ్డలు! ఆ యింటి సావడిలో ఐదు మూటలు మురికివాసన నుంచి విముక్తి కోసం ఎదురు చూస్తున్నాయి!

సావిడి తలుపులలో ఒకటి కిర్రుమంటూ తెరుచుకుంది. నాగరిక దుస్తులలో అమాయక ముఖ లక్షణాలతో ఒక స్త్రీ లోపలికి అడుగు పెట్టింది.

"ఎక్కడి నుంచొత్తన్నావే?" లోపల చెదలు తినేసిన చెక్కని పైన వేళ్ళతో కొడితే వచ్చే శబ్దం లాటి గొంతుతో అడిగాడు అతను.

"తోలుబొమ్మలాట నుంచి మావా!"

వడ్రంగి పిట్ట పొడుపులికి విరిగి పడబోయే ఎండిన సన్నని చెట్టు కొమ్మలాగా వుంది ఆమె గొంతు.

"ఎవరి తోలు? ఎంత బొమ్మ?" అంతెత్తు లేచిన అతగాడి గొంతులో అశ్లీలం స్పష్టంగా ధ్వనించింది.

ఆమె బిత్తరపోయింది.

గొంతుతో పాటు అతనూ లేచాడు.

తత్తరపాటుతో ఆమె వెనక్కి పరిగెత్తబోయింది. కాని తన ప్రయత్నం లేకుండానే సావిట్లోకి దొర్లిపోయింది. "హోలమ్మో" అన్న బాధతో ఆమె గొంతు పొర్లిపోయింది.

అతను ఆమెను లేపి, ఆమె వాయి మీద మరో వాయ దీసేంతలో నలుగురూ పోగయ్యారు.

"ఏందిరా నీ ఓమాయిత్యం అర్ధరేత్రి ఆడకూతురి మీద?" ఓ ముసలి గొంతు గదిమింది.

"ఏందా దీన .... థూ ... ఈ దొంగలం...." అతను సేవించిన మత్తు పానీయం కన్న దుర్వాసనగా వున్నాయి అతగాడి మాటలు.

"ఏం చేసిందనిరా దాని మీద అంత అభాండం దొంగ సచ్చినోడా!" ఓ ముసలమ్మ కక్కసించుకుంది.

"ఏం చేసిందా! దాన్నే అడుగు ... దాని తోలు బొమ్మలాటలూ అదీనూ!"

"ఛీ! సిగ్గులేదురా అంత మాటనడానికి? తాగుబోతు సచ్చినోడా?"

"రంకుముండ దానికి లేని సిగ్గు నాకెందుకే?"

"అరేయ్ అదిరిపాటు సచ్చినోడా! ఆదారం లేని అలగా కూతలు కుయ్యమాక! రాజుగారున్నాడు నాయం చెప్పడానికి!"

"అబ్బో రాజుగారు! మేమూ ఎరుగుదుంలే ఈ రాజుగారి సంగతులు!" అన్నాడతను.

"ఏందిరా నీకు తెలిసింది రాజు గారి సంగతి?" ముందుకొచ్చాడో ముసలాడు.

"ఏందా! పరాయోడి పంచన ఏడాదుండిపోయిన పెళ్ళాన్ని తెచ్చుకుని కులుకుతున్నాడిప్పటి దాకా! ఇంత వరకూ లంపడం వదల్లా ముసలాడికి. మళ్ళీ పిల్లల్లేరు — పెద్ద మగాడు!"

"ఏందే! ఏంది! ఏంది సచ్చేది! సంపమనుసూద్దాం! కోతుల్నేసుకుని రాకాసి మూకని సంపడం అనుకున్నావా? మొగుడూ పెళ్ళాల యవ్వారమిది. నాకూ యీర్యం వుంది. శౌర్యమున్న యింటోనే పుట్టా. పరాయోడి యెంట పడిపోయిన దాన్ని పక్కలోకి సేరనిత్తానా! ఎదవ్వేసాలేత్తే బండకేసి బాదేత్తా!" అని ముసలాణ్ణి వెనక్కి ఓ నెట్టు నెట్టి చీకట్లోకి తూలుకుంటూ వెళ్ళిపోయాడు.

వెనక్కి పడబోయి తమాయించుకుని నిలబడ్డ ముసలాడు నిర్ఘాంతపోయి, "హవ్వ! హవ్వ! ఏం పిదపకాలం! చెప్పేవాడు లేక పెడిపోతున్నారీ కుర్రకారు. మా రాజు రామసెంద్రుణ్ణే! అంతమాటే? ఈ మాట ఆయనకి తెలిత్తే యింకేమన్నా వుందా?" అని కూలబడ్డాడు.


మరో పడి వయస్కుడు అతని పక్కన కూర్చుని, "మావా!! కాలం మారిపోతోంది. నువ్వూ నేనూ బాధపడి ఏం లాభం? ఏనాటి రావణాసురుడు? ఏనాటి కత! ఆనాటికి నువ్వే సంటోడివి గదా! ఆ రోజుల యిలువలు ఆ మనుసుల మర్యాదలు ఈ ఎదవులకేం తెలుత్తాయి! సీతమ్మ తల్లి కడుపున ఓ కాయ కాచి ఎదిగితే, ఈ ఎదవలకి ఆ కాయే గుణపాటం నేర్పుద్ది. నువు బాధపడమాక. లే!" అని ఆ ముసలాణ్ణి లేపే ప్రయత్నం చెయ్యసాగాడు.

***

దాదాపు త్రేతాయుగం అయిపోవస్తోంది. అనిమిషులకు కూడా కానరాని ఒక సన్నని తిరస్కార ధూమ రేఖ ప్రజల్లోంచి బాహిరిస్తున్నదని సార్వభౌముడైన శ్రీరామచంద్రుడు పసిగట్టాడు. అది విజృంభించి అగ్నిగా వెలరేగక ముందే అదేమిటో తెలుసుకోవడానికి వేగుల వాళ్లని దశదిశలా విరజిమ్మాడు. పది రోజులుగా వాళ్లు రాత్రింపగళ్లు డేగల్లాగా, పాముల్లాగా అంగుళమంగుళం సంచరిస్తున్నారు.

ఒకనాటి రాత్రి గూఢచారి దళాధిపతి భద్రుడు సార్వభౌముడి రహస్య సమాలోచనా మందిరం ప్రవేశించాడు. అది తెలిసిన శ్రీరామచంద్రుడు తానూ అక్కడికి వచ్చాడు.

ఈ రామచంద్రుడు నవయువకుడు కాదు. అనుభవం పండిన వృద్ధ మహారాజు! రావణ సంహారానంతరం కొన్ని వందల యేళ్లు రాజ్యం చేసి ప్రజల చేత శభాషనిపించుకున్నవాడు. ఆయన యొక్క



# త్యాగం



— విశ్వనాథ పావనిశాస్త్రి

గంభీరమైన ముఖ లక్షణాలని బట్టే ఆయన్ని వృద్ధుడని అనుకోవలసిందే గాని, ఆయనలో ఎక్కడా వార్ధక్యం లేదు. చెవుల వెనక ఉబ్బెత్తుగా వున్న మూళ్ళలు! ఉక్కు చ్రటాల్లా పొంగిన ఎదు రొమ్ములు! మెలి తిరిగిన ఇనపగుండ్ల వంటి కండలు!

భ్రదుడేమి చెప్పాడో, రాజేమి విన్నాడో వాళ్ళకే తెలియాలి. మహారాజు ముఖంలో ఒక గాంభీర్యం తాండవించసాగింది.

కొంత సేపట్లో అక్కడికి భరత లక్ష్మణ శత్రుఘ్నులు వచ్చారు.

"తాగుబోతైన ఒక అధమ జాతి పౌరుడి మాటలని అంత నిశితంగా తీసుకోవలసిన అవసరం లేదేమో" నన్నాడు భరతుడు.

"అంత మాటన్న ఆ రాజ్రదోహిని నిలువునా నర కాలి" ఆవేశంతో ఊగిపోయాడు లక్ష్మణుడు.

"ఇలాంటి వాళ్ళనందరినీ నిరి చెరలో బంధించ కపోతే, ఇది యిలాగే ముదిరి చివరికి భయంకర విప్లవంగా మారవచ్చు" అంటూ ఒరలోని కత్తి పిడి మీదికి చెయ్యి పోనించాడు శత్రుఘ్నుడు.

వాళ్ళని గంభీరంగా గమనిస్తూ విచ్రితమైన ఓ నవ్వు నవ్వాడు రామచంద్రుడు.

"అయోధ్యా రాజ్య భద్రతా రమా రక్షకులారా! భరత లక్ష్మణ శత్రుఘ్ను లారా కాస్త నిదానించండి. నా మీద నిందవేసినవాడు శత్రువు కాదు. నా ప్రజ లలో ఒకడు. అతని అభిప్రాయం అతను చెప్పాడు. నిర్భయంగా చెప్పాడు. అతని అభిప్రాయం అతను చెప్పడానికి అతనికి సర్వహక్కులూ వున్నాయి. అతన్ని ఏ ద్రోహం మీద బంధిస్తారు? ఏ నేరం క్రింద శిక్షిస్తారు? ఇలా పైకి అనలేక లోపల అనుకుం టున్న వాళ్ళు ఇంకెందరున్నారో రాజ్యంలో? అధమ వర్గంలోనే ఈ వార్త యిలా వుంటే, అగ్రవర్ణాల్లో ఎల్లా వుందో? వాళ్ళనందరినీ ఎలా పట్టుకుంటారు? ఎలా శిక్షిస్తారు? ఇది కేవలం ఒక్క వ్యక్తి నోటి నుంచి వచ్చింది కాదు. అనాలోచితంగా ఒకణ్ణి శిక్షిస్తే నిజంగానే అది విప్లవానికి దారితీస్తుంది. శక్తితో అపనిందను తొలగించలేరు.

అలాగని ఈ వ్యవహారాన్ని యిలా వదిలి వెయ్యడా నికీ లేదు. దీనిని రాజు యొక్క అశక్తతగా తీసుకుని ఇక ప్రతివాడూ ఏదో ఒకటి వాగడం మొదలు పెడ తాడు. దీన్ని మొదట్లోనే తుంచాలి.

నేను భార్యాలంపటుణ్ణి అని కదా ఈ అపనింద యొక్క ప్రధాన లక్ష్యం. రావణ సంహారమూ, సీత అగ్నిప్రవేశమూ ఏనాటి సంఘటనలు! తపస్సుల చేతా, నిత్య యోగాభ్యాసం చేతా మన ఆయుర్దాయాలు పెరుగుతున్నాయి గాని సామాన్య జనంలో అప్పుడే నాల్గయిదు తరాలు గడిచిపోయాయి. వీళ్ళకి ఆ పరిస్థితులు మళ్ళీ చూపించలేము. అయినా సీత నేడు మహారాణి! పరీక్షించేదెవరు? పోనీ సీతని పరిత్య జించి నేను అడవులకు పోయి, నా శక్తి నిరూపిద్దామా అంటే అది పాత కథ! ఆనాడు నేను అడవికి వెళ్ళినా రాజున్నాడు. ఇవ్వాళ నేను వెళితే రాజ్యం అరాచక మౌతుంది.

సీత దోషి కాదని అందరికీ తెలుసు! రాముడే అందరికీ అలుసు! భార్యా లంపటత్వమే రాముడి దోషం! ఆమెను పరిత్యజించి రాముడు బ్రతకలేడని వారి ఊహ! అందుకని తాము చేసే తప్పుడు పనులు రాముడి మీదకి నెట్టే, వారు నెగ్గుకు వద్దామని వారి ఉద్దేశ్యం! అటువంటి అల్పపు టూహలు రాముదు ఏనాటికీ సాగనివ్వడు. సీతారాణి అంతకుముందే సాగని వ్వదు. ఆమె మహా రాజనీతిజ్ఞురాలు! ఈ పరిస్థితిని ఆమె నాకన్న ముందే పసిగట్టింది. అందుకని పది రోజుల క్రితమే తనకు తిరిగి అడవులకు వెళ్ళాలని వున్నదంటూ ధ్వనిగా ఈ విషయం నాతో చెప్పింది.


"ఔను" రాముడు సీతను పరిత్యజించలేదు. సీతే రాముణ్ణి పరిత్యజిస్తుంది. వృద్ధాప్యంలో భార్యా వియోగం దుస్సహం! ఆ భార్యా వియోగాన్ని భరించి రాముడు బతగ్గలడని ఆమె నిరూపిస్తుంది. రాజ్యాన్ని రక్షిస్తుంది.

"లక్ష్మణా! సీతా మహారాణిని వాల్మీకి ఆశ్రమంలో దింపిరా! ఇప్పుడా అడవులలో క్రూరమృగాలూ లేవు. మహారాక్షసులూ లేరు. ఉన్నా, జనక మహారాజు కూతురు — సకల విద్యా ప్రవీణ — ఆ మహారాణి కేం భయం? మహారాక్షసులు మాయ లేళ్ళయి చరి స్తారు ఆమె ముందు. ఇంతవరకూ రామాయణం వ్రాసుకున్న ఆ మహర్షి — ఇకసీతాయణం వ్రాస్తాడేమో!

"శత్రుఘ్నా! నా ప్రజలలో ఏ ఒక్కరి మీదా అనవ సరంగా ఈగ వాలడానికి వీల్లేదు. అలా జరిగిందా ఈ రాముడు తిరిగి కోదండ రాముడౌతాడు. జాగ్రత్త!"

"భరతా! సీతలేని రాముడు జీవచ్ఛవం! ఈ జీవ చ్ఛవం యిక రాజ్యం చెయ్యలేదు. నాకు విశ్రాంతి అవసరం! సీత లేని జీవచ్ఛవమైన రాముడి రాజ్యంలో ప్రజలు బిక్క చచ్చిపోతారు. ఇక పిచ్చి పిచ్చిగా వాగరు. నీకు రాజ్య రక్షణ భారమే గాని, పరిపాలనా భారం వుండదు. నన్ను కొన్నాళ్ళు విశ్రాంతి తీసుకోనీ!"

అని రాముడు ఆవలి ఒడ్డులేని దుఃఖ సాగరం మీద సీతా నామంతో వారధి కట్టడానికి భారంగా అడుగులు వేస్తూ అంతఃపురంకేసి కదిలిపోయాడు.




17-4-92 ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక